నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 8 జనవరి 2025 | NIZAMABAD

# గ్యారెంటీలను గంగలో కలిపిన రేవంత్

- పాలన చేతగాకుంటే రాజీనామా చేయాలి
- హామీల అమలులో సర్కార్ విఫలం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం
- బీజేపీ, హస్తం పార్టీ రెండూ ఒక్కటే
- విలేకరుల సమావేశంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి, జనవరి 7: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి గంగలో కలిపి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడని రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. చేతగాని సీఎం రేవంత్‌రెడ్డి అని, పాలన చేతకాకపోతే రాజీనామా చేయాలని మండిపడ్డారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసి న విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతుబంధు రూ.15వేలకు పెంచుతామని ప్రగల్భాలు పలికి..ఇప్పుడు రూ.12వేలు ఇస్తామంటూ రైతులను మోసం చేస్తున్నాడని మండిపడ్డారు. గత ప్రభుత్వంపై నిందలు వేస్తూ కాలం గడుపుతున్నాడన్నారు.

### ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నం

గత ప్రభుత్వం అప్పులు చేసి రైతుబంధు, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, దళిత బంధు పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.లక్ష కోట్ల అప్పుతెచ్చి ఏం చేసిందని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలపై నిలదీస్తే కేటీఆర్, కవిత, హరీశ్‌రావును సీఎం రేవంత్‌రెడ్డి ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ప్రశ్నించే గొంతులకను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

### కాంగ్రెస్ పాలనను ప్రజలు చీదరించుకుంటున్నరు..

తెలంగాణ రాకముందు రైతుబంధు, పింఛన్లు, కల్యాణలక్ష్మి వంటి పథకాలేమీలేవని బాజిరెడ్డి అన్నారు. పదేండ్ల కాలంలో ఎవరికి ఏం కావాలో తెలుసుకొని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డిని వెంటనే మార్చుకోకపోతే ఆ పార్టీ 50 ఏండ్లయినా మళ్లీరాదన్నారు. అత్యధికంగా తిట్లు తిన్న ముఖ్యమంత్రి ఉన్నాడు అంటే అది ఒక్క రేవంత్‌రెడ్డి మాత్రమే అని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి పోతేనే తెలంగాణ బాగుపడుతుందన్నారు. కాంగ్రెస్ పాలనను ప్రజలు చీదరించుకుం టున్నారన్నారు. రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ రంగం కుదేలైందన్నారు. సినీ పరిశ్రమ ఆంధ్రకు తరలిపోయే అవకాశం ఉందన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తే సహించేదిలేదని బాజిరెడ్డి హెచ్చరించారు.

### కాంగ్రెస్, బీజేపీ నాయకులు కేంద్రంతో కొట్లాడి నిధులు తేవాలి

బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని బాజిరెడ్డి అన్నారు. ఉదయం కాంగ్రెస్, రాత్రి బీజేపీ నాయకులు కలుసుకుంటారన్నారు. ఈ రెండు పార్టీలు కలిసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. కేంద్రంతో కొట్లాడి నిధులు తీసుకురావాలని, కానీ బీఆర్‌ఎస్‌పై పడుతున్నాయని మండిపడ్డారు. ఫార్ములా ఈ-కార్ రేసు వ్యవహారంలో ప్రభుత్వం దిగిరాక తప్పదని, భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఆరు గ్యారెంటీలు అమలుచేయలేక కేటీఆర్ మీద పడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో మొదటిసారి ఈ రేసును ప్రారంభించి రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేశారన్నారు. హైదరాబాద్‌కు బ్రాండ్ ఇమేజ్ వచ్చిందని, రూ. 700కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. కోర్టు స్పాట్ పిటిషన్ కొట్టివేస్తే కాంగ్రెస్ సోషల్ మీడియాలో అడ్డగోలుగా పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు రాంకిషన్ రావు, ఎస్‌కే ఆలీం, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్, తెలంగాణ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇలాగైతే ప్రజల్లోకి వెళ్లలేం..

- కొందరికే రుణమాఫీ జరిగింది
- రైతులు నిరాశలో ఉన్నారు
- అందరికీ మాఫీ వర్తింపజేయాలి
- లేకుంటే 'స్థానిక' ఎన్నికల్లో కష్టమే
- కుండబద్ధలు కొట్టిన కాంగ్రెస్ నేతలు
- రసాభాసగా పార్లమెంటరీ స్థాయి సమీక్షా సమావేశం

డిచ్‌పల్లి, జనవరి 7: వంద శాతం రుణమాఫీ చేశామన్న ప్రభుత్వ ప్రకటనల్లో డొల్లతనం బయట పడింది. కొందరికే రుణమాఫీ అయిందని, ఇంకా 60 శాతం కంటే ఎక్కువ మందికి మాఫీ కావాల్సి ఉందని కాంగ్రెస్ నేతలు కుండబద్ధలు కొట్టారు. డిచ్‌పల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ స్థాయి సమీక్షా సమావేశంలో కొందరు నాయకులు ఈ అంశాన్ని లేవనెత్తారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేల సమక్షంలోనే రైతులందరికీ రుణమాఫీ కాలేదనే విషయాన్ని స్పష్టం చేశారు.రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేశ్ రెడ్డి, మరికొందరు నేతలు సమావేశంలో మాట్లాడుతూ.. ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల్లో 33 శాతం మందికే రూ.2 లక్షల లోపు మాఫీ అయిందన్నారు. మిగతా వారికి మాఫీ కాక పోవడంతో వారంతా నిరాశలో ఉన్నారన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల వద్దకు వెళ్లాలంటే కచ్చితంగా రుణమాఫీ చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత పీసీసీ చీఫ్, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జితో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రిదే అని అన్నారు.

### ఆగ్రహానికి లోనైన ఎమ్మెల్సీ

సమావేశంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహానికి లోనయ్యారు. సభ లెడ్జర్ బుక్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరు లేకపోవడం, బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పేరు ఉండడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. అలాగే, ఎమ్మెల్యేను వేదిక పైకి పిలవడంపైనా మండిపడ్డారు. కష్టకాలంలో పార్టీని పట్టుకుని, కార్యకర్తలను కాపాడుకుని ఉన్న తనను కాదని ఎమ్మెల్యే సంజయ్‌ను సభకు ఎలా పిలుస్తారని ప్రశ్నించారు. అంతకు ముందు ఎమ్మెల్యే సంజయ్ సమావేశానికి రావడం చూసి కార్యకర్తలు ఆగ్రహంతో ఊగిపోయారు. సంజయ్ ప్రసంగిస్తున్న సమయంలో అదే నియోజకవర్గానికి చెందిన కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జీవన్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని నినదించారు. స్టేజీపై ఉన్న ముఖ్య నాయకులు వారిని వారించలేక మిన్నకుండి పోయారు.


కామారెడ్డిలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గ్రూపుల గోల.. నాయకుల తండ్లాట

# కాంగ్రెస్‌లో ఎవరిగోల వారిది!

- నిత్యం రచ్చకెక్కుతున్న వర్గపోరు
- నివురుగప్పిన నిప్పులా అసమ్మతి
- పీసీసీ చీఫ్ ముందే కుర్చీల కొట్లాట
- స్థానిక ఎన్నికల ముందు మరింత రగడ
- రసాభాసగా ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మీటింగ్

నిజామాబాద్, జనవరి 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ గ్రూపు తగాదాలకు నిలయంగా మారింది. పార్టీలో కొంత కాలంగా నివురు గప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి ఒక్కసారిగా భగ్గుమన్నది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం సాక్షిగా జగిత్యాల నియోజకవర్గ నేతల మధ్య కొట్లాట అందరినీ విస్మయానికి గురి చేసింది. జగిత్యాల తరహాలోనే నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోనూ అసమ్మతి చాప కింద నీరులా రగిలిపోతున్నది. మంగళవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. వేదిక కోసం ఎక్కడికక్కడ కింది స్థాయి క్యాడర్ వేచి చూస్తుండగా, కొన్నిచోట్ల ఏఐసీసీ పరిశీలకురాలు, రాష్ట్ర వ్యవహారాల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఎదుటే కొట్లాటకు దిగడం విస్మయానికి గురిచేసింది. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు సభా వేదికపై గౌరవం దక్కడంతో ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి కినుక వహించారు. నిమిషాల వ్యవధిలోనే సభా వేదికను దిగి పోవడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ కార్యకర్తలంతా ఆశ్చర్యపోవాల్సి వచ్చింది. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ సీనియర్ నేతల ముందే అసహనం వ్యక్తం చేస్తూ జీవన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. సంజయ్‌ను ఎలా సభా వేదికపైకి పిలుస్తారంటూ ఆగ్రహం వ్యక్తంచేయడంతో సమావేశం రసాభాసగా మారింది. వేదిక వదిలేసి వెళ్లిన జీవన్ రెడ్డిని బతిమిలాడిన పార్టీ శ్రేణులంతా తిరిగి సభా వేదికపైకి తీసుకు రావడం కత్తిమీది సాములా మారగా కార్యకర్తల నినాదాలు, కేకలతో గందరగోళం ఏర్పడింది.

### అడుగడుగునా అసమ్మతి సెగ

కాంగ్రెస్ పార్టీకి మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఘోరమైన అనుభవం ఎదురైంది. రైతు రుణమాఫీ సరిగా అమలు జరగకపోవడం, రైతు భరోసా అమలు చేయకపోవడం వంటి కారణాలతో రైతులు కాంగ్రెస్‌కు వ్యతిరేకమయ్యారు. రైతులను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడు. స్థానిక సంస్థ ఎన్నికల సమీపిస్తుండగా.. ఈ నెలలోనే పురపాలక సంఘాల పాలకవర్గాల పదవీ కాలం కూడా ముగియనున్నది. ఈ రెండింటికీ కలిపి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. ఈ పరిస్థితిలో పరువు నిలుపుకునేందుకు హస్తం పార్టీ పాకులాడుతున్నప్పటికీ అడుగడుగునా అసమ్మతి సెగలు కంటి మీద కనుకు లేకుండా చేస్తున్నాయి. గ్రూపు తగాదాల మూలంగా ఆ పార్టీ నేతలు ప్రజల్లో నవ్వుల పాలవుతున్నారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే సంజయ్ మధ్య వెలుగు చూస్తున్న కొట్లాటలే బాన్సువాడ, కామారెడ్డి, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్, ఎల్లారెడ్డి, బాల్కొండ, జుక్కల్ నియోజకవర్గాల్లోనూ చోటుచేసుకోవడం గమనార్హం.


డీసీసీ చీఫ్‌ను చుట్టుముట్టిన కార్యకర్తలు

### పీసీసీ ఇలాఖాలో ప్రచ్ఛన్న యుద్ధం


పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఇలాఖాలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నేతల మధ్య సయోధ్య లోపించింది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని జగిత్యాల రగడ ఆయన ఎదుటే జరిగింది. బాల్కొండలో డీసీసీ ప్రెసిడెంట్ మానాల మోహన్ రెడ్డి వర్సెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే రీతిలో పోరు సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ కూడా వీరికి తోడవుతున్నారు. ఆర్మూర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి వచ్చి చేరిన వినయ్ రెడ్డికి, కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్ రెడ్డికి మధ్య అంతర్గత పోరు సాగుతోంది. ఆర్మూర్ నియోజకవర్గంపై అన్వేశ్ రెడ్డి దృష్టి సారించడంతో రగడ మొదలైంది. నిజామాబాద్ అర్బన్‌లో షబ్బీర్ అలీ వర్సెస్ పీసీసీ చీఫ్ అన్నట్లుగా ప్రచ్ఛన్న యుద్ధం సాగుతోంది. మహేశ్‌కుమార్ గౌడ్‌కు పార్టీ కీలక పదవి దక్కడంతో షబ్బీర్ అలీ కొంత కాలంగా కామారెడ్డి నియోజకవర్గానికే పరిమితమవుతున్నప్పటికీ, నిజామాబాద్ అర్బన్‌లో క్యాంప్ కార్యాలయం ప్రారంభించి ప్రజలను కలుస్తుండడంతో పోరు రసవత్తరంగా మారింది. బాన్సువాడలో పోచారం శ్రీనివాసరెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి మధ్య అగాధం రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రొటోకాల్ ఉల్లంఘనలతో పాటు పార్టీ సైతం రెండుగా చీలిపోయింది. జుక్కల్ నియోజకవర్గంలోనూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మీకాంతారావుకు పాత తరం నేతలకు మధ్య సయోధ్య కుదరడం లేదు. దీంతో బాహాటంగానే రచ్చకెక్కుతున్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగానే పోరుబాటపట్టారు. ఎల్లారెడ్డిలోనూ అదే దుస్థితి ఏర్పడింది. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకు వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి ఆశీస్సులతో సుభాష్ రెడ్డి కయ్యానికి కాలు దూస్తుండడంతో అధికార పార్టీలో రోజుకో రచ్చ వెలుగు చూస్తున్నది. ఉమ్మడి జిల్లాలో పార్టీ పరిస్థితి నవ్విపోదురు గాక నాకేంటి సిగ్గు అన్నట్లుగా మారింది.

# 'భరోసా' కోతపై బీఆర్‌ఎస్ భగ్గు

కాంగ్రెస్ సర్కార్‌పై ఆగ్రహం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం 'రైతు భరోసా'లో కోత విధించడంపై బీఆర్‌ఎస్ భగ్గుమన్నది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఎకరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించడంపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి. రైతు భరోసాపై మాట తప్పిన రేవంత్ సర్కార్‌పై మండిపడ్డాయి. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కామారెడ్డిజిల్లా కేంద్రంతోపాటు మాచారెడ్డి, భిక్కనూర్, రాజంపేట, రామారెడ్డి, నస్రుల్లాబాద్, బీర్కూర్, పొతంగల్, కోటగిరి మండల కేంద్రాల్లో రాస్తారోకో, ధర్నాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాయమాటలు చెప్పి రైతన్నల ఓట్లు దండుకొని అధికారం లోకి వచ్చిందన్నారు. ఆ పార్టీ నేతలు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజా క్షేత్రంలో ముక్కు నేలకు రాయాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాల్సిందేనని, రూ.12 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంటామంటే సహించేది లేదని స్పష్టం చేశారు.


భిక్కనూర్ మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కోటగిరిలో ధర్నా చేస్తున్న బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్‌ఎస్ నాయకులు

# కొనసాగుతున్న హమాలీల సమ్మె

ఆర్మూర్, బోధన్‌లో అరెస్టు

శక్కర్‌నగర్, జనవరి 7: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయీస్ హమాలీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. మంగళవారం బోధన్ ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద లారీలను బయటికి వెళ్లకుండా హమాలీలు అడ్డుకోగా..పోలీసులు అరెస్టు చేశారు. ఆర్మూర్‌లో నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న హమాలీలను అరెస్టు చేసి, పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా హమాలీ సంఘం నాయకులు మాట్లాడుతూ.. వారం రోజులుగా శాంతియుతంగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, మరింత ఉధృతం చేస్తామన్నారు. డిచ్‌పల్లి, వర్ని మండల కేంద్రాల్లో హమాలీల సమ్మె కొనసాగింది. వర్నిలో సమ్మె చేపట్టిన హమాలీలకు సీఐటీయూ నాయకులు మద్దతు ప్రకటించారు.


బోధన్ ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద హమాలీలను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

